


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం


సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




బుధవారం 20-05-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 339 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

# ఏపీ కులగణన రిపోర్ట్

- బీసీలే ఏపీలో సగం జనాభా
- కులగణనలో భారీ నిజాలు
- శ్రీకాకుళంలో బీసీల హవా
- కోనసీమలో ఎస్సీల ఆధిక్యం
- అల్లూరిలో ఎస్టీలే మెజారిటీ
- ఓసీల్లో కడప టాప్
- మహిళలే రాష్ట్రంలో ఎక్కువ
- జిల్లాల వారీగా కుల లెక్కలు
- 5.31 కోట్ల జనాభా నమోదు
- బీసీ జనాభా 50 శాతం దాటింది
- కులాల వారీగా ఏపీ చిత్రం
- సర్వే రిపోర్ట్‌లో కీలక వివరాలు



మిగతాది 2 లో..

**న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో 2024 క్రితం కులగణన చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే వివరాలను మాత్రం బయట పెట్టలేదు. రెండేళ్ల క్రితం చేసిన కులగణనకు సంబంధించిన నివేదిక తాజాగా బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కూడా ముగింపు దశకు రాగా.. 2024 నాటి బీసీ జనాభా, ఇప్పుడు బీసీ జనాభా ఒకేలా ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ జనాభా మొత్తం 5.31 కోట్లమంది ఉన్నారు.. అయితే పురుషుల కంటే మహిళలు 1.96 లక్షల మంది ఎక్కువ ఉన్నారు. మొత్తం జనాభా 5,31,39,056లో పురుషులు 2,63,60,353 మంది ఉంటే.. మహిళలు 2,65,56,816 మంది ఉన్నారు.

ఈ సర్వేలో సామాజిక వర్గాల జనాభాకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

ఆంధ్రప్రదేశ్ జనాభాలో బీసీలు ఏకంగా 50.59 శాతం (2.69 కోట్ల మంది) ఉన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ జనాభా 18.31% (97.32 లక్షల మంది) ఉన్నారు.

ఓసీలు 23.53% ఉండగా.. ఎస్టీలు 5.86% ఉన్నారు.

హిజ్రాలు 4,842 మంది, జెండర్ వెల్లడించని వారు 2.17 లక్షలమంది ఉన్నారు.

రాష్ట్రంలో బీసీలను 5 కేటగిరీలుగా విభజించారు. బీసీ-ఏ కింద 51, బీసీ-బీ కింద 27, బీసీ-సీ కింద ఒకటి, బీసీ-డీ కింద 45, బీసీ-ఇ కింద 14 చొప్పున ఏపీలో మొత్తం 138 వెనుకబడిన తరగతుల కులాలు ఉన్నాయి.

శ్రీకాకుళం జిలాల్లో జనాభాలో అత్యధికంగా 80.83 శాతం (19.29 లక్షలు) బీసీలు ఉన్నారు.

ఆ తర్వాత విజయనగరం జిల్లాలో 76.55 శాతం (15.14 లక్షలు) బీసీలు ఉన్నారు.

మూడో స్థానంలో అనకాపల్లి జిల్లా 72.73 శాతం (12.74 లక్షల మంది బీసీలు) ఉంది.

అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేవలం 3.26 శాతం బీసీలు ఉన్నారు.

బీసీల జనసంఖ్య పరంగా చూస్తే శ్రీకాకుళం అత్యధికంగా 19.29 లక్షల మంది ఉన్నారు.. రెండో స్థానంలో కర్నూలు జిల్లా (18.85 లక్షలు), మూడో స్థానంలో విశాఖపట్నం జిల్లా (15.48 లక్షలు) ఉన్నాయి.

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

### వయోపరిమితి పెంచిన ప్రభుత్వం




2 లో

## భారత్‌కు అమెరికా మెగా రక్షణ ప్యాకేజీ

### రూ. 3,500 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్



2 లో

## సంక్షోభం వేళ భారత్‌కు అమెరికా శుభవార్త

### రష్యా క్రూడాయిల్ కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్



2 లో

**న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం):** ఇరాన్-అమెరికా యుద్ధం కారణంగా నెలకొన్న సంక్షోభం వేళ అమెరికా భారత్ కు గుడ్ న్యూస్ చెప్పింది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య రెండో దశ దాడులకు రంగం సిద్ధమవుతున్న క్రమంలో, అంతర్జాతీయంగా చమురు సంక్షోభం తలెత్తకుండా ఇంధన మార్కెట్ స్థిరత్వానికి అమెరికా ఒక కీలక నిర్ణయం తీసుకుంది.

## బోటు మనదే.. వేట మనదే

## ఇక్కడ వేటకొస్తే వెంటాడతాం

### : సీఎం చంద్రబాబు



2 లో

**న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ తీరంలోకి బయటి మత్స్యకారులు వేటకొస్తే.. వారివెంటపడి శిక్షిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. మంగళవారం నెల్లూరు జిల్లా కావలిలో తుమ్మలపెంట వేదికగా.. మత్స్యకారుల సేవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆసరాగా ఉండేందుకు.. ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేల చొప్పున 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మత్స్యకారులకు ఇచ్చే సాయంలో ఒక్కపైసా కూడా పెంచలేదని విమర్శించారు. కూటమి సర్కార్ మత్స్యకారులకు ఇచ్చే సహాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిందన్నారు. మత్స్యకారుల్ని పేదరికం నుంచి బయటికి తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో రూ.3256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

## ఏపీలో పాస్టర్ అభినయ దర్శన్ పై దాడి



2 లో

**న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం):** ఏపీలో పాస్టర్ అభినయ్ దర్శన్ పై దాడి ఘటన కలకలం రేపుతోంది. రాష్ట్రంలో ఇటీవల భరోసా పేరుతో కొత్త రాజకీయపార్టీని స్థాపించిన పాస్టర్ అభినయ దర్శన్ పై కొందరు దాడికి పాల్పడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన పాడేరు నియోజకవర్గం పరిధిలోని చింతపల్లి మండలం నీరుతోటపాలెం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు పాస్టర్, మరో ముగ్గురిపై కత్తులతో దాడి చేశారు.దుండగులు ముసుగులతో వచ్చి పార్టీ పేరుతో మత ప్రచారం చేస్తావా అంటూ దాడి చేసినట్టు తెలుస్తోంది. మొదట కారును గుడ్లు విసిరిన దుండగులు తరవాత ఆయుధాలు, కత్తులతో ఒక్కసారిగా దాడిచేసినట్టు బాధితులు చెబుతున్నారు.

## వీధికుక్కల్ని చంపేయండి..

## సుప్రీంకోర్టు సంచలన తీర్పు



2 లో

**న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం):** దేశంలో వీధికుక్కల దాడులు, కుక్కకాట్ల ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో వాటి నివారణపై సుప్రీంకోర్టు మంగళవారం అత్యంత కీలకమైన, సంచలన తీర్పు వెలువరించింది. మనుషుల ప్రాణాలకు ముప్పుగా మారిన పిచ్చి కుక్కలు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడే కుక్కలు, ఆకలితో ఉండే ప్రమాదకరమైన వీధి కుక్కలకు చట్టపరంగా కారుణ్య మరణం ఇవ్వాలని సుప్రీంకోర్టు అధికారుల్ని ఆదేశించింది.

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై మరోసారి విచారణ చేపట్టింది. వీధికుక్కల్ని షెల్టర్లకు తరలించాలని గతేడాది నవంబర్ లో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని పిటిషన్లలో కోరగా.. అందుకు ధర్మాసనం నిరాకరించింది.

## తెలంగాణ విద్యుత్ రంగంలో కొత్త అధ్యాయం

## రైతు డిస్కం రెడీ



2 లో

**న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం):** తెలంగాణ విద్యుత్ రంగంలో సరికొత్త అధ్యాయానికి తెరలేపిన రైతు డిస్కం (టీజీఆర్‌పీడీసీఎల్) ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. వచ్చే నెల జూన్ 2వ తేదీ నుంచి ఈ నూతన డిస్కం పూర్తిస్థాయి కేడర్ స్ట్రెంత్‌తో తన సేవలను అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న దక్షిణ, ఉత్తర డిస్కంల నుంచి వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వేరుచేసి ఈ ప్రత్యేక డిస్కంను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ల విద్యుత్ వినియోగం ఆధారంగా కొత్తగా ఏర్పాటైన రైతు డిస్కం వాటా 42 శాతంగా ఖరారైంది. సీఎండీగా ముషారఫ్ ఫరూఖీ నియమితులయ్యారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు, లొకేషన్ల సేకరణ కోసం రైతు డిస్కం ప్రత్యేక యాప్‌ను రూపొందించి క్షేత్రస్థాయి సర్వేలను ముమ్మరం చేసింది. ఒకప్పుడు ఈ డిస్కంలో చేరేందుకు వెనకడుగు వేసిన ఉద్యోగులు, ఇంజినీర్లు.. ఇప్పుడు ఇందులో చేరేందుకు భారీగా పోటీ పడుతుండటం విద్యుత్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.


**అప్పుడు వద్దు.. ఇప్పుడు ముద్దు**

రైతు డిస్కం ఏర్పాటు చేసిన మొదట్లో అందులో డెప్యూటేషన్‌పై వెళ్లడానికి కూడా ఉద్యోగులు తీవ్ర అనాసక్తి చూపించారు. కొన్ని ఉద్యోగ సంఘాల (యూనియన్ల) నేతలు కూడా ఈ డిస్కం ఏర్పాటుపట్ల వ్యతిరేకత వ్యక్తం చేయడంతో అసలు దీని భవిష్యత్తు ఏమిటనే గందరగోళ పరిస్థితి నెలకొంది. కేవలం 2వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో, దాదాపు 60 మంది సిబ్బందితో అత్యంత సాదాసీదాగా ఈ కంపెనీ స్థాపన ఏర్పాట్లు జరిగాయి. అయినప్పటికీ, ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా పట్టుదలగా రైతు డిస్కం ఏర్పాటు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లింది. అయితే, కాలక్రమేణా ఉద్యోగుల అభిప్రాయంలో ఊహించని మార్పు వచ్చింది. డిస్కంలో చేరే వారికి ప్రభుత్వం పదోన్నతుల ఆఫర్ ప్రకటించడంతో సీన్ రివర్స్ అయింది. ప్రస్తుతం డిస్కంలో ఖాళీగా ఉన్న సుమారు 500 ఇంజనీర్ల పోస్టుల కోసం ఏకంగా 1260 మందికి పైగా అధికారులు, సిబ్బంది దరఖాస్తు చేసుకోవడం విశేషం.

Registered No : APTEL/25/A0818
# ఇది కద నిజం



## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. వయోపరిమితి పెంచిన ప్రభుత్వం




న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూసే అభ్యర్థులకు ప్రభుత్వం ఊహించని గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటి వరకూ ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేవారి వయసు 34 సంవత్సరాలుగా ఉండగా.. దానిని మరో 10 సంవత్సరాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు ట్రై చేసే అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ జీఓ జారీ చేసింది. నిరుద్యోగ యువత అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కానీ.. పెంచిన వయోపరిమితి డైరెక్ట్ రిక్రూట్మెంట్ పోస్టులకు మాత్రమే వర్తిస్తుందని, యూనిఫాం సర్వీసుల ఉద్యోగాల పెంపుకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలీస్, అగ్నిమాపక, ఎక్సైజ్ కంట్రోల్, జైలు, అటవీశాఖల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న 34 ఏళ్ల వయో నిబంధనే వర్తిస్తుందని స్పష్టం చేసింది.

## భారత్‌కు అమెరికా మెగా రక్షణ ప్యాకేజీ రూ. 3,500 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్



న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం): భారత్-అమెరిక మధ్య మెగా రక్షణ ప్యాకేజీ డీల్ కుదిరింది. భారత సైన్యానికి చెందిన అత్యాధునిక 'అపాచీ' అటాక్ హెలికాప్టర్లు, 'ఎం777' అల్ట్రా-లైట్ హోవిట్జర్ ఫిరంగుల సహాయక సేవలు, రక్షణ పరికరాల సరఫరా కోసం సుమారు 428 మిలియన్ డాలర్ల (దాదాపు 3,500 కోట్లకు పైగా) ఒప్పందానికి అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాలలో రాజకీయ స్థిరత్వం, శాంతికి ప్రధాన భాగస్వామిగా ఉన్న భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఈ డీల్ దోహదపడుతుందని అమెరికా పేర్కొంది. ఇందులో భాగంగా 'ఏఎచ్-64ఈ అపాచీ' హెలికాప్టర్ల దీర్ఘకాలిక నిర్వహణ, లాజిస్టిక్స్ సేవల కోసం 198.2 మిలియన్ డాలర్లను కేటాయించగా, దీనికి బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తాయి.

మరోవైపు సరిహద్దుల్లో అత్యంత కీలకమైన 'ఎం777ఏ2' హోవిట్జర్ ఫిరంగుల విడిభాగాలు, మరమ్మతులు, సాంకేతిక సహాయం, శిక్షణ కొరకు 230 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదిరింది. దీనికి బిఏఈ సిస్టమ్స్ కాంట్రాక్టర్‌గా ఉంటుంది. ఈ అత్యాధునిక సేవలు, పరికరాలను తమ సాయుధ దళాల్లో విలీనం చేసుకోవడం భారతదేశానికి చాలా సులువైన విషయమని అమెరికా ప్రశంసించింది. ఈ మెగా రక్షణ ఒప్పందం ద్వారా భారత్ ప్రస్తుత, భవిష్యత్ ప్రాంతీయ ముప్పులను మరింత సమర్థవంతంగా ఎదుర్కొని, తన దేశీయ రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోగలదని వైట్ హౌస్ స్పష్టం చేసింది.

## బోటు మనదే.. వేట మనదే
## ఇక్కడ వేటకొస్తే వెంటాడతాం-సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి



మన రాష్ట్ర తీరంపై వేటాడే హక్కులు పూర్తిగా మనకే ఉన్నాయన్నారు. బోటు మనదే.. వేట మనదే.. ఇతరలు వస్తే వెంటాడుతాం.. అని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల బోట్లు మన తీరంవైపు వస్తే శాటిలైట్ ద్వారా గుర్తించి వెనక్కి పంపుతామన్నారు.

ఇక జువ్వలదిన్నె హార్బర్ త్వరలోనే పూర్తవుతుందని, దానిపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని సీఎం కోరారు. ఫిషింగ్ హార్బర్ లో మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. చేపలు మంచి ప్రొటీన్ ఫుడ్ అని, చేపలు తింటే డయాబెటీస్ రాదని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. మత్స్యకారుల చేపల ఉత్పత్తులకు తానే మార్కెటింగ్ మేనేజర్ గా పనిచేస్తానన్నారు.

కృష్ణా నదిలో బోట్లతో మత్స్యకారుల భారీ ర్యాలీ

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. మత్స్యకారులు కృష్ణానదిలో బోట్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. వరుసగా రెండోఏడాది మత్స్యకారుల సేవలో పథకం కింద నిధులు విడుదల చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. వేట నిషేధ సమయంలో ఇబ్బందులు పడకుండా.. ఒక్కో మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

## ఏపీలో పాస్టర్ అభినయ దర్శన్ పై దాడి

మొదటి పేజీ తరువాయి

దాడి తరవాత పాస్టర్ తీవ్రగాయాలతో రోడ్డు పక్కన పడిపోగా స్థానికులు అక్కడకు చేరుకుని వెంటనే చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దాడి తరవాత ఆస్పత్రిలో అభినయ దర్శన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల లాగే తనను కూడా చంపాలని చూస్తున్నారు అంటూ పాస్టర్ అభినయ దర్శన్ వ్యాఖ్యానించారు. పోలీసుల విచారణపై తనకు నమ్మకం లేదని అన్నారు. తనపై తానే దాడి చేసుకున్నట్టు తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తనపై దాడి విషయంలో పోలీసులు డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా పాస్టర్లు అందరూ దొంగలే అనే తరహాలో చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. తనపై దాడి జరగటం వెనుక కుట్ర ఉందని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా దాడితో ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకి సంబంధం ఉందని అనుకోవడంలేదని చెప్పారు.

## వీధికుక్కల్ని చంపేయండి.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

మొదటి పేజీ తరువాయి

ఆసుపత్రులు, బస్ స్టాండ్లు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు వంటి పబ్లిక్ ప్రదేశాల నుండి పట్టుకున్న వీధికుక్కలకు వ్యాక్సినేషన్ లేదా స్టెరిలైజేషన్ (కుక్కల శస్త్రచికిత్స) పూర్తయిన తర్వాత, వాటిని తిరిగి అదే ప్రదేశాలలో వదిలిపెట్టకూడదని గత నవంబర్‌లో కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవరించడానికి నిరాకరించింది. వీధికుక్కల్ని కేవలం జంతుసంరక్షణ కేంద్రాలకే పరిమితం చేయాలని స్పష్టం చేసింది.

ఈ సందర్భంగా దేశంలో పిల్లలు, వృద్ధులు, టూరిస్టులపై కుక్కలు దాడులు చేస్తున్న ఘటనలపై ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వీధికుక్కల దాడుల నుంచి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించడంలో విఫలమయ్యారని కోర్టు తప్పుబట్టింది. హార్ష్ గ్రౌండ్ రియాలిటీలను చూస్తూ కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడంపై జస్టిస్ సందీప్ మెహతా అసహనం వ్యక్తం చేశారు. వీధికుక్కల కారుణ్య మరణాలు, వాటిని జంతుసంరక్షణ కేంద్రాలకు తరలించడంపై సుప్రీంకోర్టు జారీ చేసిన ఈ ఆదేశాలను అమలు చేయడంలో వైఫల్యం చెందితే, సంబంధిత అధికారులపై కోర్టు ధిక్కార చర్యలతో పాటు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. హైకోర్టులు స్వయంగా కేసులను నమోదు చేసి ఈ నిబంధనల అమలును పర్యవేక్షించాలని సూచించింది. గత ఏడాది జూలైలో ఓ ఆరేళ్ల చిన్నారి రేబిస్ వ్యాధితో మరణించిన వార్త ఆధారంగా సుప్రీంకోర్టు సుమోటోగా ఈ కేసును స్వీకరించి, సుదీర్ఘ విచారణ అనంతరం ఈ చారిత్రాత్మక తీర్పును వెలువరించింది.

## సంక్షోభం వేళ భారత్‌కు అమెరికా శుభవార్త రష్యా క్రూడాయిల్ కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

జూన్ 17 వరకు అంతర్జాతీయ మార్కెట్ నుండి రష్యా క్రూడాయిల్‌ను కొనుగోలు చేసుకోవచ్చని ప్రపంచ దేశాలకు వైట్ హౌస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అప్పటివరకు రష్యాపై గతంలో విధించిన ఆర్థిక ఆంక్షల నుంచి పూర్తి మినహాయింపు ఉంటుందని యుఎస్ ఫైనాన్స్ మినిస్టర్ స్కాట్ అధికారికంగా ప్రకటించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల వేళ.. ఇంధన ధరలు ఆకాశాన్నంటకుండా నిరోధించేందుకు అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం, రష్యా నుండి భారీగా చమురు దిగుమతి చేసుకునే భారతదేశానికి ఒక పెద్ద శుభవార్తగా, ఊరటగా మారింది.



అమెరికా ప్రకటించిన ఈ తాజా మినహాయింపులతో రష్యా నుంచి తక్కువ ధరకే ఆయిల్ కొనుగోళ్లను భారత్ మరింత భారీగా పెంచే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, అంతర్జాతీయంగా మారుతున్న సమీకరణాలు, అమెరికా ఆంక్షలతో సంబంధం లేకుండా తాము దేశీయ ఇంధన అవసరాల కోసం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిరంతరాయంగా కొనసాగిస్తూనే ఉన్నామని భారత ప్రభుత్వం స్పష్టం చేయడం గమనార్హం. ఏదేమైనప్పటికీ, ఇరాన్ పరిణామాల నేపథ్యంలో చమురు ధరలు పెరగకుండా అమెరికా ఇచ్చిన ఈ వెసులుబాటు.. అటు భారత ఆర్థిక వ్యవస్థకు, ఇటు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉండేందుకు ఎంతగానో దోహదపడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## తెలంగాణ విద్యుత్ రంగంలో కొత్త అధ్యాయం.. రైతు డిస్కం రెడీ

మొదటి పేజీ తరువాయి

కేడర్ల వారీగా పోస్టులు – దరఖాస్తులు

| విభాగం/ఉద్యోగ హోదా | అవసరమైన పోస్టులు | వచ్చిన దరఖాస్తులు |
|---|---|---|
| (ఎలక్ట్రికల్ విభాగం ) | | |
| చీఫ్ ఇంజినీర్ | 5 | 10 |
| సూపరింటెండింగ్ ఇంజినీర్ | 14 | 111 |
| డివిజనల్ ఇంజినీర్ | 43 | 247 |
| అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ | 129 | 424 |
| అసిస్టెంట్ ఇంజినీర్ | 309 | 417 |
| (సివిల్ విభాగం) | | |
| సూపరింటెండింగ్ ఇంజినీర్ | 1 | 1 |
| ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ | 2 | 10 |
| అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ | 3 | 31 |
| అసిస్టెంట్ ఇంజినీర్ | 5 | 3 |
| మొత్తం | 511 | 1254 |

పెరిగిన క్రేజ్

రైతు డిస్కంలో పోస్టింగుల కోసం ఇంతగా డిమాండ్ పెరగడానికి దాని పరిధి కూడా ఒక ముఖ్య కారణంగా తెలుస్తోంది. ఈ నూతన వ్యవస్థలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎస్ఈ (సూపరింటెండింగ్ ఇంజనీర్) వ్యవస్థ ఉంటుంది. ప్రస్తుతం ఉన్న కొత్త జిల్లాలకు డీఈ (డివిజనల్ ఇంజనీర్) ఇంచార్జ్‌లుగా వ్యవహరిస్తారు. ఇక సీఈ (చీఫ్ ఇంజనీర్) పరిధి మరింత విస్తృతంగా ఉండనుంది. మొత్తం టీజీఎస్పీడీసీఎల్ పరిధి అంతటికీ కలిపి ఒకరు, అలాగే టీజీఎన్పీడీసీఎల్ పరిధి మొత్తానికి మరొకరు చొప్పున కేవలం ఇద్దరు సీఈలు ఇంచార్జ్‌లుగా ఉంటారని సమాచారం. బాధ్యతలు, అధికారాల పరిధి చాలా పెద్దదిగా ఉండటంతో ఇక్కడి పోస్టింగుల కోసం అధికారులు ఎగబడుతున్నారు.

దేశానికే రోల్ మోడల్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ రైతు డిస్కం మోడల్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. తెలంగాణలో ఈ ప్రక్రియ విజయవంతంగా ముందుకు సాగుతుండటాన్ని చూసి.. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో పాటు హర్యానా సహా మరికొన్ని రాష్ట్రాలు కూడా ఇదే తరహాలో ప్రత్యేక రైతు డిస్కమ్‌ల ఏర్పాటుకు కసరత్తులు ప్రారంభించాయని నూతన డిస్కంకు చెందిన ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.

సేవలు వేగవంతం

సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారుల కొరతను అధిగమించేందుకు వచ్చిన దరఖాస్తులను సీనియారిటీ ప్రాతిపదికన పరిశీలిస్తున్నారు. పారదర్శకంగా బదిలీలు, పోస్టింగుల ప్రక్రియను పూర్తి చేసి.. జూన్ 2 కల్లా నూతన కేడర్ స్ట్రెంత్‌ను రంగంలోకి దించి కొత్త డిస్కం సేవలందించనుందని అధికారులు తెలిపారు. ఈ నూతన విధానం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే.. సమర్థవంతంగా పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభించడంతో పాటు, రైతులకు, వినియోగదారులకు మరింత నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందుతాయని విద్యుత్ రంగ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సామాన్యుడికి మళ్ళీ షాక్.. మరోసారి భగ్గుమన్న ఇంధన ధరలు




న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం): మిడిల్ ఈస్ట్ యుద్ధ ప్రభావంతో అన్ని రకాల నిత్యావసర ధరలు సామాన్యుడి నడ్డీ విరుస్తుండగా.. నేడు ఇంధన ధరలు మరో షాక్ ఇచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, దేశీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో, దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. తాజా సవరణ ప్రకారం, లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలపై సగటున 90 పైసలు మేర భారం పెరిగింది. అయితే, వివిధ రాష్ట్రాల్లో ఉండే స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా కొన్ని నగరాల్లో ఈ పెంపుదల కనిష్టంగా 80 పైసల నుండి గరిష్టంగా 1.00 రూపాయి వరకు వర్తింపజేశారు. దీంతో నేడు హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 110.89 కి చేరగా, డీజిల్ ధర లీటరుకు రూ.98.96 కు చేరింది. కాగా సాధారణ ప్రజలపై నేరుగా ప్రభావం చూపే ఈ ధరల పెంపుదల, రవాణా రంగంపై అదనపు భారాన్ని మోపనుంది.

ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు క్రమంగా పెరుగుతుండటంతో, దేశీయంగా ఇంధన ధరలను సవరించక తప్పలేదని నిపుణులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ బలహీనపడటం కూడా మరో ప్రధాన కారణం. చమురు దిగుమతుల కోసం భారతదేశం ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి రావడంతో ఈ భారాన్ని వినియోగదారులపై వేయాల్సి వచ్చింది. దేశంలో ఎన్నికల ప్రక్రియ ముగిసిన తక్షణమే కేంద్ర ప్రభుత్వం, చమురు నియంత్రణ సంస్థలు ఈ ధరల పెంపును అమలు చేయడం గమనార్హం. ఎన్నికల సమయంలో ధరలను స్థిరంగా ఉంచినప్పటికీ, పోలింగ్ ముగిసిన వెంటనే ఈ భారాన్ని పెంచడంపై విపక్షాల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఏపీ కులగణన రిపోర్ట్...బీసీలే ఏపీలో సగం జనాభా

మొదటి పేజీ తరువాయి



అత్యధిక శాతం ఎస్సీలు కోనసీమ జిల్లాలో..

ఏపీలో ఎస్సీలు 18.31 శాతం (97.32 లక్షల మంది) ఉన్నారు. ఎస్సీల్లో 59 ఉపకులాలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జనాభాలో ఎస్సీల శాతం పరంగా 27.66% (4.28 లక్షల)తో తొలి స్థానంలో ఉంది. రెండో స్థానంలో ప్రకాశం 27.15% (4.94 లక్షలు) మూడో స్థానంలో ఏలూరు 24.71% (5.17 లక్షల)మంది ఉన్నారు. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 0.54% మాత్రమే ఎస్సీ జనాభా ఉంది. ఎస్సీల జనసంఖ్య పరంగా తిరుపతి జిల్లాలో 5.61 లక్షలు, నెల్లూరు జిల్లాలో 5.47 లక్షలు, ఏలూరు జిల్లాలో 5.17 లక్షల మందితో తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.


ఎస్టీలు ఎక్కువగా ఉన్న జిల్లా అల్లూరి..

రాష్ట్రంలో ఎస్టీలు 5.86 శాతం (31.16 లక్షలు) ఉన్నారు. ఎస్టీల్లో 34 ఉప కులాలు ఉన్నాయి. ఏపీ జనాభాలో ఎస్టీల శాతం పరంగా మొదటి స్థానంలో అల్లూరి సీతారామరాజు (94.40%) ఉంది. రెండో స్థానంలో పోలవరం జిల్లా 71.73 శాతం, మూడో స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా 30.53 శాతంతో ఉన్నాయి. అత్యల్పంగా పశ్చిమ గోదావరి (0.94%) జిల్లాలో ఎస్టీ జనాభా ఒక్క శాతం కంటే తక్కువగా ఉంది. ఎస్టీల సంఖ్యాపరంగా అల్లూరి సీతారామరాజు (6.60 లక్షలు), పార్వతీపురం మన్యం జిల్లా (3.01 లక్షలు), పోలవరం జిల్లా (2.84 లక్షలు) వరుసగా ఒకటి, రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఓసీ జనాభాలో కడప జిల్లాకు తొలి స్థానం..

ఏపీలో అగ్రవర్ణాలు 23.53 శాతం (1.25 కోట్ల మంది) ఉన్నారు. అలాగే తమ కులం పేరు వెల్లడించని వారు 1.64% (8.75 లక్షల మంది) ఉన్నారు. ఏపీ జనాభాలో ఓసీల శాతం పరంగా కడప జిల్లా (7.80 లక్షలు) మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో తూర్పుగోదావరి జిల్లా (7.61 లక్షలు), మూడో స్థానంలో కాకినాడ జిల్లా (7.58 లక్షలు) జిల్లా ఉన్నాయి. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజులో (5,743 మంది) ఓసీలు ఉన్నారు. 2024 కులగణనలో తమ కులాన్ని వెల్లడించని వారిలో విశాఖపట్నంలో అత్యధికంగా 76,288 మంది ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఎన్టీఆర్ (57,466 మంది), కర్నూలు (48,034 మంది) జిల్లాలు ఉన్నాయి.


## మతపరమైన ఉద్రిక్తతలపై వార్తలు హైదరాబాద్ పోలీసుల లీగల్ నోటీసులు




న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం): హైదరాబాద్‌లోని మెహదీపట్నం, గుడిమల్కాపూర్ పరిసర ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసుల కీలక నిర్ణయం తీసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో మతపరమైన విద్వేషాలను రగిల్చేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెడుతున్న వారిపై సిటీ పోలీస్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సోషల్ మీడియా, మీడియా, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రజా శాంతికి భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న 17 ప్రముఖ అకౌంట్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ శాఖకు చెందిన ఐటీ సెల్ 'ఎక్స్ కార్పొరేషన్' లీగల్ విభాగానికి అధికారికంగా నోటీసులు జారీ చేసింది. సమాచార సాంకేతిక సవరణ చట్టం-2008 లోని సెక్షన్ 69(ఏ), 79(3) తో పాటు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత లోని సెక్షన్ 94, 179 కింద ఈ లీగల్ నోటీసును పంపారు.

ఈ నోటీసులో పోలీసులు మొత్తం 17 అకౌంట్లు, లింకులను పొందుపరిచారు. వీటిలో ఎఐఎంఐఎం అధికారిక హ్యాండిల్, ది సియాసత్ డైలీ, న్యూస్ మీటర్ వంటి మీడియా సంస్థల ఖాతాలతో పాటు కొందరు ప్రజాప్రతినిధులు (మొహమ్మద్ నసీరుద్దీన్ – ఎంఐఎం కార్పొరేటర్), బీఆర్ఎస్ భారత్, హిందుత్వ డాన్, అష్రఫ్ హుస్సేన్ వంటి పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల అకౌంట్లు ఉన్నాయి. ఈ ఖాతాల ద్వారా షేర్ అవుతున్న వివాదాస్పద హ్యాష్‌ట్యాగ్‌లు, కంటెంట్ ప్రజల్లో అశాంతిని పెంచేలా ఉన్నాయని.. ప్రజా భద్రత దృష్ట్యా ఈ పోస్టులను వెంటనే సమీక్షించి, ప్లాట్‌ఫారమ్ విధానాల ప్రకారం తగిన కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్స్ యాజమాన్యాన్ని పోలీసులు కోరారు.

## మద్యం తాగించి బీటెక్ స్టూడెంట్‌పై అత్యాచారం



న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం): హైదరాబాద్‌లో దారుణం చోటు చేసుకుంది. బీటెక్ విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారానికి పాల్పడ్డ ఘటన నగరంలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఉదయ్ అనే విద్యార్థి తన స్నేహితురాలిని ఈ నెల 14న రాత్రి సమయంలో దిల్‌సుఖ్‌నగర్‌కు తీసుకువచ్చాడు. ఓ హోటల్‌లో టీ తాగిన తరవాత తిరిగి ఇద్దరూ కారులో ఇబ్రహీంపట్నం బయలుదేరారు. మార్గమధ్యలో మద్యం తీసుకున్న ఉదయ్ యువతిని ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి ఆమెకు సైతం మద్యం తాగించాడు. యువతి మద్యం మత్తులోకి జారుకోవడంతో ఇబ్రహీంపట్నంలోని ఓ గదికి తీసుకువెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. స్నేహితుడే అని నమ్మివెళితే అత్యాచారం చేయడంతో యువతి ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## దేశంలోకి 'ఆర్థిక తుఫాన్'
### మోడీ విధానాలపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



న్యూస్ డెస్క్, 19 మే (ఇది కద నిజం): దేశ ఆర్థిక పరిస్థితిపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల దేశంలో త్వరలోనే భారీ 'ఆర్థిక తుఫాన్' రాబోతోందని, దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. మంగళవారం రాయ్‌బరేలీలో విలేకరులతో మాట్లాడిన ఆయన, ప్రధాని నరేంద్ర మోడీ ఆర్థిక వ్యూహాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

సామాన్యుడిపైనే ఆర్థిక భారం..

ప్రధాని మోడీ మార్చిన ఆర్థిక నిర్మాణం (అదానీ-అంబానీ మోడల్) ఎక్కువ కాలం నిలబడదని, అది త్వరలోనే కుప్పకూలిపోతుందని రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. రాబోయే ఆర్థిక సంక్షోభం వల్ల మోడీకి కానీ, అదానీ-అంబానీలకు కానీ ఎటువంటి నష్టం జరగదని.. కేవలం సామాన్య ప్రజలు మాత్రమే అపూర్వమైన కష్టాలను ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉంటే, ప్రధాని తగిన చర్యలు తీసుకోకుండా ప్రజలను విదేశీ పర్యటనలు మానమంటున్నారని, కానీ ఆయనేమో ప్రపంచ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు.

# ఈనెల 23న యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి



## కంచి పీఠాధిపతి ఆధ్వర్యంలో వేద పాఠశాలకు శంకుస్థాపన

ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో ఈనెల 23వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఈఓ భవాని శంకర్ వెల్లడించారు. పర్యటనలో భాగంగా ఈనెల 23న టెంపుల్ సిటీలో నిర్మించనున్న 'లక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాల'కు కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. దీనితో పాటు అదే రోజు కొండపైన సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేస్తారు. ఇందులో భాగంగా కొండపైన నిర్మించనున్న కళ్యాణ మండపం, దీక్షపరుల సదనం, భక్తుల సౌకర్యార్థం మెట్ల మార్గానికి పైకప్పు (షెల్టర్), అలాగే ప్రధానాలయం వాయువ్య దిశ నుండి మాడ వీధుల్లోకి వెళ్లడానికి వీలుగా నిర్మించే కొత్త మెట్ల మార్గం పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాల కంటే ఒక రోజు ముందుగానే, అనగా ఈనెల 22వ తేదీన కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు యాదగిరిగుట్టకు చేరుకుంటారు. 22న సాయంత్రం 4 గంటలకు ఆయన లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకోనున్నారు. స్వామివారి దర్శనానంతరం భక్తులను ఉద్దేశించి కంచి పీఠాధిపతి అనుగ్రహ భాషణం చేయనున్నట్లు ఆలయ ఈఓ భవాని శంకర్ స్పష్టం చేశారు.

# పెద్దపల్లి జిల్లాలో పలు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి సంయుక్త తనిఖీలు!



ఇది కద నిజం: దక్షిణ మధ్య రైల్వే సంస్థ ఆధ్వర్యంలో రైల్వే లైన్ విస్తరణ, ఆధునీకరణలో భాగంగా లెవల్ క్రాసింగ్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ , రోడ్డు అండర్ బ్రిడ్జ్ , ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కాజీపేట – బల్లార్షా సెక్షన్ల మధ్య పెద్దపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకై అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఓదెల మండలం పొట్కాపల్లి గ్రామ పరిధిలోని ఎల్సి .28 & 29 (కి.మీ. 315/5-7 & 314/30-32), ఓదెల గ్రామ పరిధిలోని ఎల్సి .31 & 32, కొలనూర్ గ్రామ పరిధిలోని ఎల్సి .34 లతో పాటు అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ పరిధిలోని ఎల్సి .52 వద్ద ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక పెద్దలు, రైతులకు బ్రిడ్జిల నిర్మాణ అలైన్మెంట్ గురించి అధికారులు కూలంకషంగా వివరించి, ప్రజల నుండి సలహాలు, సూచనలను సేకరించారు. ఈ సంయుక్త తనిఖీ కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సామ్రాట్ రాయ్, రోడ్ సెక్టార్ ప్రాజెక్టు రైల్వే భూసేకరణ నిపుణులు పి. దేవరాజు, పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, ఓదెల తాసిల్దార్ ధీరజ్, సుల్తానాబాద్, రామగుండం తాసిల్దార్లు పాల్గొన్నారు. వీరితో పాటు ఆర్అండ్బీ , పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ , మిషన్ భగీరథ విభాగాల అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన మొత్తం 323 మంది లబ్ధిదారులకు ఆయన స్వయంగా ఈ చెక్కులను అందజేశారు. మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తే యాదగిరిగుట్ట మండలం ఓ పట్టణంలో 61, తుర్కపల్లిలో 42, ఆత్మకూరులో 39, బొమ్మలరామారంలో 37, రాజపేటలో 31, గుండాలలో 29, మూటకొండూరులో 28, ఆలేరులో 22 మందితో పాటు మిగిలిన ప్రాంతాలకు చెందిన మరో 35 మందికి ఈ సహాయం అందింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనకు కొత్త అర్థం తీసుకువచ్చిందని, ప్రతి సంక్షేమ పథకాన్ని ఎంతో పారదర్శకంగా ప్రజలకు అందిస్తోందని స్పష్టం చేశారు. మధ్యవర్తులు, పైరవీలు, కమిషన్లకు తావులేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెన్షన్, రేషన్ కార్డు, సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల కోసం ఎవరైనా డబ్బులు ఆశించినా, కిరాయిల పేరుతో ఇబ్బంది పెట్టినా వెంటనే అధికారులకు లేదా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తూ, పారదర్శక పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.



## సినిమా షూటింగ్ పేరుతో దారుణం..

# యువతిపై ఇద్దరు యువకుల అత్యాచారం!



ఇది కద నిజం: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఓ యువతిపై ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడిన ఘటన కలకలం రేపుతోంది. సినిమా షూటింగ్‌లో అవకాశం ఇస్తామని నమ్మించి యువతిని గదికి తీసుకెళ్లి రెండు రోజుల పాటు అత్యాచారం చేయారు. బాధితురాలి ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో ఇద్దరు అనాథ యువతులు నివాసం ఉంటున్నారు. వారు చిన్న చిన్న సినిమా షూటింగ్‌లు, ఈవెంట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ యువకుడు బాధిత యువతితో పరిచయం పెంచుకుని.. సినిమా షూటింగ్ ఉందంటూ మాయమాటలు చెప్పి నమ్మించాడు. ఆ తర్వాత యువతిని సికింద్రాబాద్‌లోని ఓ గదికి తీసుకెళ్లిన నిందితుడు.. తన స్నేహితుడితో కలిసి ఆమెపై రెండు రోజుల పాటు లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం ఈ నెల 16న ర్యాపిడో బుక్ చేసి యువతిని తిరిగి పంపించారు. ఇంటికి వచ్చిన యువతి ఒంటిపై గాయాలు ఉండటాన్ని గమనించిన ఆమె స్నేహితురాలు వెంటనే గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. చికిత్స సమయంలో వైద్యులు ఏమి జరిగిందని ప్రశ్నించగా.. తనపై లైంగికదాడి జరిగిన విషయాన్ని బాధితురాలు వెల్లడించింది. దీంతో బాధితురాలి స్నేహితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా ఇద్దరు గుర్తుతెలియని యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సినిమా అవకాశాల పేరుతో యువతులను మోసం చేసే వారిపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# తెలంగాణ విజ్ఞప్తి మేరకు.. కేఆర్ఎంబీ సమావేశం మరోమారు వాయిదా




హైదరాబాద్, ఇది కద నిజం : నదీ జలాల్లో వాటా సహా ఇతర అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం మరోమారు వాయిదా పడింది. బోర్డు 21వ సమావేశాన్ని తొలుత ఈ నెల 14వ తేదీన ఏర్పాటు చేశారు. అదే రోజు ఏపీ కేబినెట్ సమావేశం ఉండడంతో భేటీని ఈనెల 21వ తేదీకి గతంలో వాయిదా వేశారు. అయితే.. ఈ నెల 21న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. దీంతో కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. తెలంగాణ విజ్ఞప్తి మేరకు 21న జరగాల్సిన సమావేశాన్ని కేఆర్ఎంబీ వాయిదా వేసింది. సమావేశం తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామని కృష్ణా బోర్డు తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చారు.

# కృష్ణానదిలో రావాల్సిన నీటిని ఏపీకి అప్పగించింది కేసీఆరే: మంత్రి జూపల్లి



ఇది కద నిజం: పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. మంగళవారం జరిగిన ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి జూపల్లి కృష్ణారావు. కృష్ణానదిలో రావాల్సిన నీటిని ఏపీకి తరలించింది బీఆర్ఎస్ సర్కారేనని అన్నారు.

పాలమూరు ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ చెబుతోందని... రెండేళ్లలో పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేస్తామని కేసీఆర్ చెప్పారని.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పాలమూరు ఎందుకు పూర్తి చేయలేదని అన్నారు

కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు ఒప్పుకుంది బీఆర్ఎస్ సర్కారేనని..కృష్ణాలో 512 టీఎంసీలు కావాలని కాంగ్రెస్ కొట్లాడుతోందని అన్నారు జూపల్లి. రేవంత్ నాయకత్వంలో పాలమూరు వంద శాతం పూర్తి చేస్తామని అన్నారు. కృష్ణానదిలో 62 శాతం నీటి కేటాయింపులు కావాలని కోరుతున్నామని అన్నారు మంత్రి జూపల్లి.

## యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న సీఎం ప్రిన్సిపాల్ సెక్రెటరీ శ్రీనివాస రాజు



ఇది కద నిజం:యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ముఖ్యమంత్రి ప్రిన్సిపాల్ సెక్రెటరీ శ్రీనివాస రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాస రాజు దంపతులు స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద మండపం వద్ద వేద పండితులు వారికి మంత్రోచ్చారణలతో వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో భవాని శంకర్ సీఎం ప్రిన్సిపాల్ సెక్రెటరీకి స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని మరియు లక్ష్మీనరసింహస్వామి వారి పవిత్ర చిత్రపటాన్ని బహూకరించి గౌరవించారు.

# ఇచ్చోడ రహదారిపై కారులో మంటలు



అదిలాబాద్,ఇది కద నిజం: అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని రహదారిపై మంగళవారం కారు అగ్నికి ఆహుతైంది. అదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానికులు కారులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం మంటలు వేగంగా వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## పెద్దపల్లి జిల్లాలో విషాదం..వ్యవసాయ బావి దరి కూలి ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు




పాలకుర్తి, ఇది కద నిజం : పెద్దపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పాలకుర్తి మండలం జయ్యారం గ్రామానికి చెందిన మామిడాల రాజయ్యకు చెందిన వ్యవసాయ బావిలో సిమెంట్ గాజులు వేస్తూండగా బావి దరి కూలి ఇద్దరు కూలీలు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దపల్లి కి చెందిన రేషావేణి రాజయ్య, జయ్యారం గ్రామానికి చెందిన మామిడాల రాజయ్యకు చెందిన బావి గాజులు పోసేందుకు కాంట్రాక్టు తీసుకుని పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం కాంట్రాక్టర్ రేషవేణి రాజయ్య, జూలపల్లి మండలం వడ్కాపూర్ కు చెందిన కూలీ భీమోజు అంజయ్య, మరోకులీ సాగర్ లు బావిలో సిమెంట్ గాజులు పోసే పనిలో ఉన్నారు.

ఒక్కసారిగా గాజులకు సపోర్టుగా పోసిన మట్టి దరి బావిలో కూలింది. దీంతో రేషనవేణి రాజయ్య, భీమోజు అంజయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సాగర్ కు తీవ్ర గాయలు కాగా పెద్దపల్లికి తరలించారు. పోలీసులు సంఘటస్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసేందుకు బావిలో మోటర్లతో నీటిని ఎత్తిపోస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య




ఇది కద నిజం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన యూనివర్శిటీ సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. మృతుడిని ఎంఏ ఎకనామిక్స్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న మయాంక్ కుందుగా గుర్తించారు పోలీసులు. మృతుడి స్వస్థలం వెస్ట్ బెంగాల్ రాష్ట్రం. గతంలో యూనివర్సిటీలో ల్యాప్‌టాప్‌ల దొంగతనంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు మయాంక్. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సినిమా న్యూస్

## ఫ్లాప్ దర్శకుడితో మరోసారి భారీ రిస్క్?



అక్కినేని నాగచైతన్య 'తండేల్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని మంచి ఫామ్‌లో ఉన్నాడు. బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నాడు. ప్రస్తుతం ఆయన 'విరూపాక్ష' చిత్రంతో సెన్సేషన్ క్రియేట్ చేసిన కార్తీక్ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' అనే మైథికల్ మిస్టరీ థ్రిల్లర్ చేస్తున్నారు. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా.. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే.. తాజాగా నాగచైతన్య నెక్స్ట్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన ఒక ఫ్లాప్ దర్శకుడితో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్. ఒకప్పుడు తనదైన మాస్, యాక్షన్ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన కోలీవుడ్ సీనియర్ దర్శకుడు లింగుసామి ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు సమాచారం.

తెలుగులో రామ్ పోతినేని హీరోగా 'ది వారియర్' మూవీ తీసి భారీ డిజాస్టర్ అందుకున్న లింగుసామి.. ఇటీవల చైతు కోసం ఒక పవర్ ఫుల్ మాస్ కథను సిద్ధం చేశారట. ఆ కథ విన్న నాగచైతన్యకు బాగా నచ్చడంతో సినిమా చేయడానికి ఒప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ కాంబినేషన్ వార్త విన్న అక్కినేని అభిమానుల్లో కాస్త ఆందోళన మొదలైంది. ఎందుకంటే, గతంలో నాగచైతన్య కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ వెంకట్ ప్రభు దర్శకత్వంలో చేసిన 'కస్టడీ' సినిమా బాక్సాఫీస్ డిజాస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఫామ్‌లో లేని మరో కోలీవుడ్ దర్శకుడు లింగుసామితో చైతు రిస్క్ చేస్తుండటంతో.. ఈసారైనా హిట్ కొడతాడా? లేదా మళ్లీ పాత ఫలితమే రిపీట్ అవుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.






## ఆశలన్నీ ఆ సినిమాపైనే పెట్టుకున్న భాగ్యశ్రీ బోర్సే

టాలీవుడ్ యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. మాస్ మహారాజా రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతోప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా తర్వాత ఆమె మరికొన్ని చిత్రాల్లో నటించినప్పటికీ, అవి బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేక డిజాస్టర్లుగా మిగిలిపోయాయి. అయితే చిత్రాల పరాజయాలతో సంబంధం లేకుండా ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మాత్రం రోజురోజుకూ భారీగా పెరుగుతోంది. తన అందం, అభినయంతో కుర్రకారును ఆకట్టుకున్న భాగ్యశ్రీ బోర్సేకు వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం భాగ్యశ్రీ కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తీకేయన్ సరసన 'సెయాన్' అనే భారీ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తూ తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతోంది. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభం కాగా, ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేశాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న భాగ్యశ్రీ, ఈ ప్రాజెక్ట్ గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది.

సినిమా కథ గురించి ఇప్పుడే ఎక్కువ విషయాలు వెల్లడించలేనని చెబుతూనే.. ఈ చిత్రంలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని స్పష్టం చేసింది. ఒక నటిగా తనలోని ఉత్తమ ప్రతిభను బయటకు తీసేందుకు, ప్రేక్షకులకు తన నటనను నిరూపించుకోవడానికి, ఈ సినిమా ఒక మంచి వేదిక అవుతుందని ఆమె గట్టి నమ్మకం వ్యక్తం చేసింది. సినిమాల్లో నటించేటప్పుడు నటీనటులు తాము చేసే పాత్రలకు, ప్రేక్షకులకు నిజాయితీగా ఉండాలని భాగ్యశ్రీ బోర్సే తన అభిప్రాయాన్ని పంచుకుంది. అందుకోసం తాము నటించే చిత్రాల భాషను ఖచ్చితంగా నేర్చుకోవాలని ఆమె పేర్కొంది. గతంలో తెలుగులో రౌడీ హీరో విజయ్ దేవరకొండకు జంటగా 'కింగ్‌డమ్' చిత్రంలో నటించినప్పుడు, ఆ భాషపై పట్టు సాధించి తన పాత్రకు తానే సొంతంగా డబ్బింగ్ చెప్పుకున్న భాగ్యశ్రీ.. 'సెయాన్' సినిమా కోసం కూడా ప్రస్తుతం ప్రత్యేకంగా తమిళ భాషను నేర్చుకుంటున్నట్లు వెల్లడించింది.

## ఇక్కడితో ఆగదు

అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సరికొత్త హారర్ థ్రిల్లర్ 'డిమాంటీ కాలనీ-3'. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ 'డిమాంటీ కాలనీ-2' సినిమాకు సీక్వెల్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలో అరుళ్ నిధితో పాటు విలక్షణ నటుడు గురు సోమసుందరం ఒక కీలకమైన 'లైబ్రేరియన్' పాత్రలో కనిపిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ మొత్తం పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటూ త్వరలోనే థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది. ఈక్రమంలో.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న డైరెక్టర్ అజయ్ జ్ఞానముత్తు, ఈ సినిమా గురించి కొన్ని షాకింగ్ కామెంట్స్ చేశారు. "డిమాంటీ కాలనీ-3 సినిమా చాలా భారమైన, ఉత్కంఠభరితమైన, తీవ్రంగా భయపెట్టే చిత్రంగా ఉండబోతోంది. థియేటర్‌లో ఈ మూవీ చూసి భయపడకుండా ఎవరూ బయటకు రాలేరు.

ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు క్వెంటిన్ టరాంటినో ఒకసారి.. 'మీరు సినిమాను అధ్యయనం చేయలేరు, కేవలం అనుభూతి చెందగలరు' అన్నారు. అది వంద శాతం నిజం, నేను ఈ చిత్రం విషయంలో ఆ భయాన్ని అనుభూతి చెందాను" అని అజయ్ తెలిపారు. మొదటి భాగం రిలీజ్ అయినప్పుడు దానికి సీక్వెల్స్ తీయాలనే ఆలోచన లేదని, కేవలం ఒకే ఒక సినిమాగా తీశామని డైరెక్టర్ స్పష్టం చేశారు. అయితే రెండో భాగం తీసేటప్పుడు మాత్రం, కథలోని లాజిక్‌లను వివరిస్తూ మొదటి భాగానికి అనుసంధానించడం పెద్ద సవాలుగా మారిందని అన్నారు. తనకు లెజెండరీ దర్శకుడు హిచ్‌కాక్ సినిమాలు అంటే చాలా ఇష్టమని, ఆయన థ్రిల్లర్ చిత్రాల్లో ఎంతో కచ్చితత్వం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ హారర్ సిరీస్‌ను ఇక్కడితో ఆపడం లేదని.. 'డిమాంటీ కాలనీ కథను డిమాంటీ కాలనీ-4, డిమాంటీ కాలనీ-5, డిమాంటీ కాలనీ-6 వరకు' కొనసాగించేలా ముందే ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు అజయ్ జ్ఞానముత్తు సంచలన ప్రకటన చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## మరోసారి సంక్రాంతిని టార్గెట్ చేసిన నాగవంశీ?



తమిళ స్టార్ హీరో కార్తీ హీరోగా, మ్యాడ్ ఫేమ్ కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించనుండగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదల విషయంలో నాగవంశీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆయన నిర్మించిన అనేక చిత్రాలు సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదలై మంచి విజయాలను అందుకున్నాయి. 2024 సంక్రాంతి కానుకగా విడుదలైన గుంటూరు కారం ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఈ ఏడాది అనగనగా ఒక రాజు చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రస్తుతం కార్తీతో రూపొందుతున్న ఈ సినిమాను కూడా సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదల చేయాలని నిర్మాత భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక గుంటూరు కారం, అనగనగా ఒక రాజు చిత్రాల్లో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించడం విశేషం. అదే బ్యానర్‌లో ఆమె నటిస్తున్న మూడో సినిమా కూడా సంక్రాంతికే విడుదల కానుందనే వార్తలతో మరోసారి సంక్రాంతి సినిమాతో ఈ బ్యూటీ హిట్ అందుకుంటుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.